



అమెరికులాసా కథ – 220

చైనాలో ఇలా ఉంటుందనమాట!

అప్పుడప్పుడు నాకు 'దూరాలోచనలు" వస్తుంటాయి అని నేను అనుకుంటాను కానీ "ఆపుడప్పుడు ఏమిటీ..ఎప్పుడూనూ" అని మా క్వీన్ విక్టోరియా ఖచ్చితమైన అభిప్రాయం. ఆవిడ మాట కాదు అనడం ఎందుకులే అని ఈ సారి 10వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు చైనాలో పెడితే ఎలా ఉంటుందీ అనేసుకోడం. అందరూ ముందు ముక్కున వేలు వేసుకోవడం, అందరికన్నా ఎక్కువగా చప్పిడి ముక్కుల చైనీయుల దేశంలో ఉన్న మన మామూలు తెలుగు ముక్కుల వారే ఠక్కున కాకపోయినా అందులో ఉన్న 'కిక్' గమనించి మక్కువతో ఎక్కువ ఆ ఆలోచన ని అక్కున చేర్చుకున్నారు. చక్కటి సాహిత్య ప్రణాళిక వేసి ఈ అక్టోబర్ 24–25, 2026 తారీకులలో షాంఘై మహానగరం లో 10వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు పక్కాగా జరపడానికి తగుదునమ్మా అని నేను వారం క్రితం చైనా లో అడుగుపెట్టాను... పక్కనే మా సతీమణి, పెద్దమ్మాయి కుటుంబం, మనవడితో సహా... ఇప్పటి దాకా ఎంతో కుతూహలంతో నేను చూసిన పదిహేను దేశాలు ఒక ఎత్తు. ఇది మరొక ఎత్తు. ఎందుకంటే అటు మన భారత దేశం, ఇటూ అమెరికా చైనా అనగానే ఎంతో 'దారుణమైన దేశం" గా ప్రచారం చేయడం వలన నేనూ ఆ మాయలో పడి భయంగా హడిలిపోతూ, ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఎక్కడ మూసేస్తారో అని హడిలి చస్తూ చైనాలో అడుగుపెట్టిన నాకు గత వారం రోజుల్లోనూ కాస్త 'కనువిప్పు' జరిగి ఇది చాలా గొప్ప దేశం సుమా అనే అభిప్రాయం కలిగింది. నేను కేవలం పర్యాటకుడిని కాబట్టి ముందు ఆ మేజిక్ ఎక్కువగా ఉండవచ్చు. ఇక్కడే నివశిస్తే అసలు "మెరిసేదంతా బంగారం" కాక పోవచ్చు. పీత కష్టాలు పీతవే!.

ఇక కథా ప్రారంభంబెట్టిదనినా.....

హ్యూస్టన్ లో మా కుటుంబం ..అనగా నేను, సతీమణి, మా పెద్దమ్మాయి కుటుంబం, మనవడు అవినాష్ తో తవాన్ లోని తైపై మీదుగా 22 గంటల ప్రయాణం లో సామూహిక ఒళ్ళు హూనం చేసుకుని బేజింగ్ మహా నగరం చేరాం. అంటే మా చిన్నప్పుడు పీకింగ్ అనమాట. ఇప్పుడు పీకడానికి ఏమీ లేదేమో మరి!

ఇంత మంది కోసం మా టూర్ కంపెనీ వారు పంపిన ఇద్దరు చైనీయ కారు డ్రైవర్లు మా లగేజీ చూసి తారెత్తిపోయి చైనింగ్లీష్ లో హై, కుయ్, కుయ్యో అంటూనే మేరియాట్ హొటెల్ కి మమ్మల్ని తీసుకెళ్ళి వాళ్ళ ఇళ్ళకో మరెక్కడికో పారి పోయారు. విమానాశ్రయం నుంచి వెళ్ళేదారి అంతా మిగతా దేశాలలాగానే భాష మార్పిడి తప్ప హై వేలు, పక్కన చెట్లూ ఒకేలాగా ఉన్నాయి..కానీ ఎక్కడా ఒక్క పూల మొక్క కూడా అస్సలు కనపడ లేదు. సాధారణంగా ఏ దేశం లో అయినా..ఆఖరికి మన హైదరాబాద్ లోనూ, సింగపూర్ లోనూ కూడా బోగన్ విలియాలు మొదలైన పూల మొక్కలు ఎయిర్ పోర్ట్ నుంచి బయటకి వచ్చే రహదారులకి అటూ ఇటూ ఉండి బావుంటుంది. వాతావరణం కూడా కాకినాడ లాగానే ఉంది. అదేమిటో కానీ అస్సలు చైనా వచ్చిన ఫీలింగ్ రానే లేదు.అస్సలు భయం వెయ్య లేదు...అది మొదటి ఫీలింగు...

కానీ.. దివ్యంగా ఉన్న మారియాట్ హొటెల్ గదిలో దిగి రూమ్ సర్వీస్ కి కాఫీ ఆర్డర్ చెయ్యగానే ఐదంటే ఐదే నిమిషాలలో తలుపు దగ్గర నుంచి "వచ్చేశా" అన్నట్టు మ్యూజిక్ తో తలుపు కొడుతున్నట్టు అనిపించి ఎవడో కింగ్ కాంగ్ గాడు కాఫీ తెచ్చాడేమో అని తలుపు తియ్యగానే ఒక అందమైన రోబాట్ మిల మిలా మెరుస్తూ కనపడింది. మీట నొక్కగానే దాని తలుపు తెరుచుకుని ఒక సంచీ బయటకి వచ్చింది, అది తీసుకుని మరొక మీట నొక్క గానే అది మళ్ళీ మిల మిలాలాడుతూ థకీమని వెనక్కి తిరిగి నడుచుకుంటూనో, పాక్కుంటూనో, మరేవిటోనో చేసుకుంటూ వెళ్ళి పోయింది. అప్పుడు అసలైన నిజమైన టెక్నాలజీ భయం వేసింది. కావాలంటే ఆ వీడియో ఈ క్రింది లింక్ లో పెట్టాను. అలాగే కొన్ని ఫొటోలు కూడా....

https://drive.google.com/file/d/1MOawy0Qlx--nIXU8FlxnDMYN2IrZUzjG/edit

అనింటికనా ముఖ్యమైన విషయం....చైనీయులు అందరి జేబుల్లోనూ ఉన్న స్మార్ట్ ఫోన్లలో మనం ఇంగ్లీష్ లో రాసినా, మాట్లాడినా వాళ్ళకి చైనా భాషలోనే తర్జుమా అయిపోవడం...వాళ్ళు ఎంతో వినయంగా లింగ్, పింగ్ అన్నా, వాళ్ళ లిపిలో బొమ్మలు గీసినా మనకి ఆంగ్లం లో అర్ధం అయిపోవడం చూసి అసలు మొన్నటికి మొన్న అమెరికాలో ట్రంప్ గారూ, చైనా అధ్యకుడు షీ జిన్‌పింగ్ గారూ తమ శిఖరాగ్ర సమావేశాలలో ఎంత సునాయాసంగా తిట్టుకుంటారో అర్ధం అయిపోయింది. మరి మన భారతీయులు వచ్చీ రాని బొట్లేరు ఇంగ్లీష్ బదులు ఇలాగ హిందీ, టెల్గూ లలో తర్జుమా స్మార్ట్ ఫోన్లు పెట్టుకుంటే సరి పోతుంది కదా! దాని బదులు మన భాషని తుంగలో తొక్కేసి గంగలో పారెయ్యడం ఎందుకుటా!

అమెరికట్ చేస్తే....

ఇప్పటి దాకా 22 కోట్ల జనాభా ఉన్న బీజింగ్, కోటిన్నర ఉన్న జాంజియాజీ పర్వతాల నగరం, 25 కోట్ల మంది ఉన్న షాంఘై నగరాలని అతి తక్కువ సమయం లోనే చూడగలిగినా....నేను గమనించిన కొన్ని ఆసక్తికరమైన విషయాలు కొన్ని ఉన్నాయి. అవేమీ పెద్ద చెప్పుకోదగ్గవి కాదు కానీ అలా మన దేశం ఎందుకు లేదా అని చెప్పుతో కొట్టుకోవక్కర లేని సామాన్యమైన విషయాలాగా అనిపించవచ్చు.


చైనాలో 75 శాతం కార్లు ఎలెక్ట్రికల్ కార్లే. మోటర్ సైకిళ్ళు లేనే లేవు. స్కూటర్లు కూడా ఇంచుమించు అన్నీ ఎలెక్ట్రికల్ వే. నేను ఉన్న పది రోజుల్లోనూ రెండే రెండు గాస్ స్టేషన్లు..అంటే పెట్రోలు బంకులు చూశాను. ఇక అతి పెద్ద 18 వీలర్ లంటి ట్రక్ లు రాత్రి పది దాటాకే రోడ్డు మీద కి రావాలిట. అంచేత మా అమెరికాలోగా ఫ్రీ వే ట్రాఫిక్ అంతా పెద్ద ట్రక్కులు, మోటర్ సైకిళ్ళతో గోల గోల గా లేదు. చైనా మేకలు, ఆవులు గేదెలు ఎలా ఉంటాయో తెలీనే లేదు. మామూలు సైకిళ్ళు పొట్టిగా నీలం, పసుపు రంగుల్లో ఉంటాయి. ఈ సైకిళ్ళు అన్నీ గవర్నమెంట్ వే. మీరు ఒక చోట అద్దెకు తీసుకుని ..అంటే ఆ సైకిల్ మీద ఉన్న చిన్న మీటర్ లో డబ్బు కట్టి...మీరు వెళ్ళవలసిన చోటుకి ఆ సైకిల్ తొక్కుకుని వెళ్ళి అక్కడ స్టాండ్ లో వదిపిపెట్టెయ్య వచ్చు. అలాగే స్కూటర్లు కంపెనీ వాళ్ళే మీకు ఇస్తారు...ఎవరి కంపెనీ రంగు ఆ కంపెనీదే. ఇక టాక్సీ బుక్ చెయ్యడానికి ఒక నిముషం, వాళ్ళు మన దగరికి రావడానికి రెండు, మూడు నిమిషాలు...అంతా స్మార్ట్ ఫోన్ లోనే...ఎక్కడా కరెన్సీ లేదు. నోట మాటా లేదు. అస్సలు ఎవరితోటీ మాట్లాడ వలసిన పనే లేదు. ఇక్కడ బస్ స్టాండ్, రైల్వే స్టేషనూ, విమానాశ్రయాలూ...అన్నీ ఒక్క లాగానే ఉన్నాయి. దేశం చాలా ఐశ్వర్యవంతమైన, పకడ్బందీ డిసిప్లిన్ ఉన్న దేశం లాగా కనపడి..మనం ఇక్కడ ఉండలేము సుమా అనిపించింది. ఆఫ్టరాల్...భారత్ లోనూ అమెరికాలోనూ మన ఇష్టం వచ్చిన వేషాలు మనం వేసుకునే స్వాతంత్ర్యం మనకి ఉంది కదా!

అన్నింటికన్నా ముఖ్యంగా ఇక్కడ పరిశుభ్రత చూసి నిఘంగానే భయం వేసింది... సగటు అమెరికా వాడి కంటే సగానికి సగం, గట్టిగా ఐదున్నర అడుగుల మాత్రమే ఎత్తు, 125 పౌండ్లు బరువు, పీలగా, బక్క పలచటి 1.5 బిలియన్ చైనీయులు తమ దేశాన్ని ఇంత పరిశుభ్రంగా, ఎక్కడ చూసినా టెక్నాలజీ తో, చిరునవ్వు, సేవాభావం, అణకువల తో, అద్భుతమైన డిసిప్లిన్ తో ఎలా ఉన్నారో....అయ్య



బాబోయ్....అన్నట్టు ఈ దిక్కుమాలిన చైనాలో తెలుగు వాళ్ళకి అస్సలు నచ్చనిది మరొకటి ఉంది సుమా..అదే 'మందు' దొరకడం చాలా కష్టం..నాకైతే ఎక్కడా బెల్ట్ షాపులు కనపడనే లేదు. నాకు కుతూహలం వేసి మేమున్న పెద్ద హొటెల్ లో "ఇక్కడ స్కాచ్ విస్కీ ఉందా?" అని అడగగానే వాడు బిత్తర పోయి వెర్రి మొహం పెట్టాడు. ఇక ఈ దేశం ఎలా అభివృద్ధి చెందుతుందో మరి.

మొత్తానికి చైనాలో ఉన్న పది రోజులలోనూ బీజింగ్ లో చూసిన "చైనా గొప్ప గోడ"– The Great Wall of China, జాంగియాజీ నగరం దగ్గర టియాన్ మెన్ పర్వతాలు, అవతార్ పర్వతాలు, గాజు తో కట్టిన పెద్ద పొడుగాటి సస్పెన్సన్ వంతెన, షాంఘైలో చూసిన ప్రపంచమ్లోనే అతి ఎత్తైన భవనాలు. గంటకి 300 కిమీ వేగంతో "ఎగిరే రైలు"...అంటే మేగ్నెటిక్ లెవిటేషన్ తో పట్టాలు లేకుండా 'గాలి" లో రైలు ప్రయాణం....ఇలా ఎన్నెన్నో ఎన్ని ఉన్నా ఒక చోట "సాహిత్యానికి నోబెల్ బహుమానం పొందిన తొలి ఆసియా ఖండ నివాసి" అని మన రవీంద్రనాథ్ టాగూర్ శిలా విగ్రహం షాంఘై లో చూసినప్పుడు "హమ్మయ్య. చైనాలో మొట్టమొదటి తెలుగు సాహితీ సదస్సు" నిర్వహణ కోసం ఇక్కడికి వచ్చిన నాకు మహదానందం వేసింది.... ఆ వివరాలు త్వరలోనే....సాంపుల్ కి కొన్ని ఫొటోలు జత పరిచాను...











★★★★

COMMENTS